నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 7 జనవరి 2025 | YADADRI BHUVANAGIRI

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ సెక్రటరీ మాధవీలత

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవీలత

భువనగిరి కలెక్టరేట్, జనవరి 6 : మహిళలు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ సెక్రటరీ వి.మాధవీలత అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా చట్టాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికీ సమాన న్యాయం, సమాన అవకాశాలు, ఉచితంగా న్యాయ సలహాలు, స్త్రీలు, దివ్యాంగులు, పారిశ్రామిక కార్మికులు, ఆర్థిక స్థోమత లేనివారు న్యాయ సలహా ఎలా పొందాలో అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులపై ఎలా స్పందించాలి.. ఎక్కడ ఫిర్యాదు చేయాలి? వంటి అంశాలపై వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ టి.నాగిరెడ్డి, అదనపు పీడీ శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, డీపీఎంలు, ఏపీఎంలు, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు భరోసా బాకీ ₹3,000 కోట్లు

- గత యాసంగిలో రూ.650 కోట్లు
- వానకాలం రూ.1950 కోట్లు
- ప్రస్తుత యాసంగిలో రూ.390 కోట్లు
- ఎకరాకు రూ.7,500 ఇవ్వని ఫలితంగా రైతుకు నష్టం
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న రైతాంగం
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్లెక్కిన రైతులు

ఉమ్మడి జిల్లా రైతులకు సర్కారు టోకరా

వరంగల్ రైతు డిక్లరేషన్, ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ఏడాదికి రూ.15వేల రైతుభరోసా హామీని తుంగలో తొక్కడం వల్ల ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది డిసెంబర్‌లో అధికారంలోకి రాగానే యాసంగి రైతు భరోసాను రూ.7,500 ఇస్తానని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన విషయం తెలిసిందే. కానీ అధికారంలోకి వచ్చాక మాట తప్పడంతో నాటి నుంచి రైతులు పెట్టుబడి సాయం కోల్పోతూనే ఉన్నారు. గత యాసంగిలో రూ.7,500 చొప్పున కాకుండా కేసీఆర్ సర్కారు మాదిరిగానే రూ.5వేలతో సరిపెట్టారు. ఆ తర్వాత వానకాలం సీజన్‌లో మొత్తానికే ఎగనామం పెట్టారు. ప్రస్తుత యాసంగిలో రైతు భరోసాను రూ.6వేల ఇస్తామని నింపాదిగా ప్రకటించారు. ఇలా మొత్తం మూడు సీజన్లలో కలిపి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ప్రకారం పరిశీలిస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగానికి రేవంత్‌రెడ్డి సర్కారు దాదాపు రూ.3వేల కోట్లు బాకీ పడినట్టైంది. కాంగ్రెస్ ప్రభుత్వ మోసంపై రైతులు మండిపడుతున్నారు. సోమవారం ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల రోడ్లపైకి వచ్చి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

– నల్లగొండ ప్రతినిధి, జనవరి 6 (నమస్తే తెలంగాణ)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కేసీఆర్ సర్కార్ హయాంలో చివరిసారిగా 2023 వానకాలంలో రైతుబంధు అమలు చేశారు. అది వరుసగా 11వ సీజన్ పంట పెట్టుబడి సాయం అవడం విశేషం. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో సుమారు 26 లక్షల ఎకరాలకు సంబంధించిన 11 లక్షల మంది రైతులకు రూ.1,250 కోట్లను అందించారు. అదే ఏడాది ఎన్నికల సమయంలోనూ యాసంగి రైతుబంధు అమలుకు కేసీఆర్ ప్రభుత్వం సిద్ధం కాగా, కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. ఆ సీజన్‌లో సైతం 1,300 కోట్ల రూపాయల పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కానీ కల్లబొల్లి, మోసపూరిత వాగ్ధానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రైతులంతా ఎన్నికల్లో చెప్పినట్లుగా రూ.7,500 పెట్టుబడి సాయంగా అందుతుందని ఆశ పడ్డారు. కానీ వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం నాలుక మడత వేయడంతో ఆశలు ఆడియాశలయ్యాయి. దాంతో ఆ సీజన్‌లో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే ఎకరాకు రూ.5వేలు మాత్రమే ఇచ్చారు. అందులోనూ కొందరికి ఎగ్గొట్టారు. వానకాలం సీజన్ నుంచి అందరికీ ఇస్తామని చెప్పి అప్పటివరకు తప్పించుకోగలిగారు. వానకాలం సీజన్ మొదలైన నాటి నుంచి కొత్త డ్రామాలు మొదలుపెట్టి సబ్ కమిటీ ఏర్పాటు, అభిప్రాయ సేకరణ వంటి సాకులతో సీజన్ అంతా కాలయాపన చేశారు. ఇంతలో యాసంగి సీజన్ రానే వచ్చింది. వానకాలం సీజన్ రైతుభరోసా గురించి వదిలేసి యాసంగికి ఇస్తామంటూ కొత్త పల్లవి మొదలుపెట్టారు. దీన్ని కూడా సాగదీస్తూ చివరకు రూ.6వేల ఇవ్వగలమని చావు కబురు చల్లగా చెప్పారు. ఇలా మొత్తంగా మూడు సీజన్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎగనామం పెట్టిన రైతుభరోసా విలువ ఉమ్మడి జిల్లాలో రూ.3వేల కోట్లుగా ఉండడం గమనార్హం.

గత ఏడాది యాసంగిలో ఎకరాకు రూ.7,500 రూపాయల చొప్పున ఇచ్చి ఉంటే ఉమ్మడి జిల్లా రైతులకు రూ.1,950 కోట్ల పంట పెట్టుబడి సాయంగా అందాల్సి ఉంది. కానీ కేసీఆర్ సర్కార్ మాదిరిగానే రూ.5వేల చొప్పున ఇవ్వడంతో రూ.1,300 కోట్లకు అటూఇటూగానే రైతులకు అందింది. దాంతో ఒక్కో ఎకరం మీద రైతులు రూ.2500 నష్టపోయారు. ఇలా ఉమ్మడి జిల్లా రైతులందరికీ కలిపి సుమారుగా రూ.650 కోట్లను ప్రభుత్వం ఎగనామం పెట్టినట్లు స్పష్టమవుతున్నది. జరిగిన జరిగింది అనుకుంటే గత వానకాలంలో రైతుభరోసా ఊసే ఎత్తలేదు. పెద్ద రైతులకు, ఉద్యోగులకు, ఐటీ చెల్లింపుదారులకు, పెన్షనర్లకు పెట్టుబడి సాయం అక్కర లేదంటూ.... భూమి విస్తీర్ణానికి పరిమితి విధిస్తామంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రుల సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సబ్ కమిటీ అభిప్రాయాల సేకరణ పేరుతో కొన్ని జిల్లాల్లో పర్యటించింది. ఇలా వివిధ రకాలుగా కాలయాపన చేస్తూ వచ్చారు. తీరా వానాకాలం సీజన్ ముగింపునకు వచ్చే సరికి రైతుభరోసాపై చేతులెత్తేశారు.

గత యాసంగిలో రూ.650 కోట్లు

ఈ యాసంగిలో రూ.400 కోట్ల కోత

ఈ నెల 26 నుంచి యాసంగి రైతుభరోసాను అమలు చేస్తామని శనివారం నాటి క్యాబినేట్‌లో నిర్ణయం చేశారు. కాగా, ముందు చెప్పినట్లు రూ.7,500 కాకుండా ఎకరాకు 6వేల రూపాయలే ఇస్తామని ప్రకటించారు. దాంతో ఒక్కో ఎకరంపై రైతులు రూ.1,500 రూపాయల పెట్టుబడి సాయాన్ని కోల్పోవాల్సి వస్తున్నది. దీని వల్ల ఉమ్మడి జిల్లా రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయంలో సుమారు రూ.400 కోట్లకు కోతపడినట్టైంది. సాగు యోగ్యం కాని భూముల ఎరివేత పేరుతో మరింత కుదించేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇలా ఎంత వీలైత అంత కోత పెట్టేందుకు ప్రభుత్వం చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తుండడంపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. రేవంత్ సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్దఎత్తున రోడ్లపైకి వస్తున్నారు. సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఆందోళనకు దిగారు. ఎకరాకు ఏడాదికి రూ.15వేల పెట్టుబడి సాయం ఇవ్వకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

వానకాలంలో రూ.1,950 కోట్లు

గత వానకాలం సీజన్‌లో కేసీఆర్ సర్కారు నాటి లెక్కల ప్రకారం చూస్తే ఉమ్మడి జిల్లాలోని 26లక్షల ఎకరాలకు గానూ 11 లక్షల మంది రైతులకు రైతుభరోసా అందాలి. కాంగ్రెస్ చెప్పిన ప్రకారంగా ఒక్కో సీజన్‌కు రూ.7,500 చొప్పున లెక్కేస్తే ఉమ్మడి జిల్లా రైతులకు సుమారుగా రూ.1,950 కోట్లు పెట్టుబడి సాయంగా దక్కాలి. కానీ ఆ సీజన్‌లో రైతుభరోసాకు మొత్తానికే ఎగనామం పెట్టారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2018 వానకాలం నుంచి రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టి నిరాటంకంగా అమలు చేస్తూ వచ్చారు. వరుసగా 11 సీజన్లలో సాగుతో సంబంధం లేకుండా పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న ప్రతి రైతు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేశారు. ఇలా మొత్తం ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతుల ఖాతాల్లో రూ.11,700 కోట్లు రైతుబంధు డబ్బులు పడ్డాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే మొత్తం పథకాన్నే నిలిపివేసి రైతులకు మొండి చేయి చూపింది.

జిల్లా ఓటర్లు 4,60,899

- ఆలేరు నియోజవకర్గంలో 2,38,248 మంది
- భువనగిరిలో 2,22,651 మంది
- పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే పెరిగిన సంఖ్య
- మహిళలే అధికం.. ఓటర్ల తుది జాబితా విడుదల

యాదాద్రి భువనగిరి, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఓటర్ల లెక్క తేలింది. రెండు నియోజకవర్గాల్లో కలిపి 4,60,899 మంది ఓటర్లు నమోదయ్యారు. భువనగిరి కంటే ఆలేరులో అధికంగా ఉన్నారు. ఎప్పటిలాగే ఈసారీ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 2,28,117 మంది పురుష ఓటర్లు, 2,32,761 మహిళలు, 21 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటరుగా నమోదు చేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఈసారి 6,947 మంది పెరిగారు.

ఓటరు జాబితాలో సవరణలు, కొత్త ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం ఏటా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపడుతుంది. జిల్లాలో గతేడాది ఆగస్టు 20 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. అక్టోబర్ 18 వరకు ఇంటింటి విచారణ, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, ఫొటోల మార్పులు, పోలింగ్ కేంద్రాల హద్దుల నిర్ధారణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. అక్టోబర్ 19 నుంచి 28 వరకు ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు ఏర్పాట్లు చేశారు. 29న ముసాయిదా జాబితాను విడుదల చేశారు. నవంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరించారు. మార్పులు, చేర్పుల అనంతరం సోమవారం తుది జాబితాను విడుదల చేశారు. జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో కలిపి 566 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

భువనగిరి నియోజకవర్గంలో 2,22,651 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,09,820 మంది పురుషులు, 1,12,830 మంది మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. భువనగిరి మండలంలో అత్యధికంగా 87,030 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ 257 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆలేరు నియోజకవర్గ పరిధిలో 2,38,248 ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,32,761 మంది మహిళలు, 2,28,117 పురుషులు, 20 మంది ట్రాన్స్‌జెండర్లు. అత్యధికంగా యాదగిరిగుట్ట మండలంలో 40,924 మంది ఓటరుగా నమోదు చేసుకున్నారు.

ఓటరు జాబితా వివరాలు..

భువనగిరి నియోజకవర్గం

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
భువనగిరి	42,443	44,586	87,029
బీబీనగర్	21,161	21,452	42,613
భూదాన్‌పోచంపల్లి	21,757	21,964	43,721
వలిగొండ	24,459	24,828	49,287
మొత్తం	1,09,820	1,12,830	2,22,650

ఆలేరు నియోజకవర్గం

బొమ్మలరామారం	14,552	14,797	29,349
తుర్కపల్లి	13,772	14,059	27,831
రాజాపేట	14,900	15,166	30,066
యాదగిరిగుట్ట	20,202	20,705	40,907
ఆలేరు	17,064	17,831	34,895
మోటకొండూరు	10,440	10,543	20,983
గుండాల	13,081	12,823	25,904
ఆత్మకూరు (ఎం)	12,827	12,574	25,401
వలిగొండ	1,459	1,433	2,892
మొత్తం	1,18,297	1,19,931	2,38,228
జిల్లా మొత్తం	2,28,117	2,32,761	4,60,899

బుక్కెడు బువ్వ పెట్టండయ్యా!

- వృద్ధాప్యంలో కొడుకులను వేడుకుంటున్న తల్లి
- ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం

కలెక్టరేట్‌లో మిర్యాల లక్ష్మమ్మ

యాదాద్రి భువనగిరి, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : 'బిడ్డా.. ఉన్న ఇల్లు మీకే రాసిచ్చిన. ఇప్పుడు ఉండడానికి ఇంత జాగ కూడా లేదు. ఏడ తినాలి? ఏడుండాలి..? రోడ్డుమీదే ఉంటున్న. అయ్యలార్లా.. బుక్కెడు బువ్వ పెట్టండి.. పట్టించుకోండయ్యా' అంటూ ఓ అవ్వ వేడుకున్నంటున్నది. నడవలేని పరిస్థితిలో ఉన్న వీల్‌చైర్‌లో వచ్చిన ఆమెను ఓ వ్యక్తి చిన్నపిల్లలా కలెక్టరేట్ లోపలికి చేతుల్లో ఎత్తుకుని రాగా, ప్రజావాణిలో ఉన్నతాధికారుల ఎదుట తన ఆవేదనను వ్యక్తం చేసింది. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామానికి చెందిన మిర్యాల లక్ష్మమ్మకు ముగ్గురు కుమారులు. ఆమెకు ఓ ఇల్లు ఉండగా.. ముగ్గురు కొడుకులకు గిఫ్ట్ డీడ్ చేసింది. నెలకో కొడుకు దగ్గర ఉండేలా పెద్ద మనుషులు ఒప్పందం చేశారు. ఒక్కొక్కరు నెలకు వెయ్యి చొ ప్పున మూడు వేల రూపాయలు తల్లి ఖర్చులకు ఇ స్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉ న్నా ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆ తల్లి యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి వచ్చింది. తన బాగోగులు చూడని కొడుకుల నుంచి తన ఇంటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి, తనకు న్యాయం చేయాలని వేడుకున్నది.

రైతన్నకు దన్నుగా రోడ్డెక్కిన బీఆర్ఎస్

- రైతు భరోసాలో కోత పెడితే ఊరుకునేది లేదని స్పష్టీకరణ
- రైతులతో కలిసి ఎక్కడికక్కడ ధర్నాలు.. రాస్తారోకోలు
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం

భువనగిరిలో ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

యాదాద్రి భువనగిరి, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు కాకుండా కాంగ్రెస్ సర్కారు రైతు భరోసాలో కోత పెట్టడంపై బీఆర్ఎస్ భగ్గుమన్నది. రైతుల దోఖా చేసే నిర్ణయాన్ని ఖండిస్తూ అన్నదాతకు దన్నుగా ఆందోళనలకు దిగింది. రేవంత్ సర్కారు దుశ్చర్యను ఎక్కడికక్కడ ఎండగట్టింది. 15వేల రూపాయలు కాకుండా రైతు భరోసా ఏటా రూ.12వేలు మాత్రమే ఇస్తామనడాన్ని దునుమాడుతూ సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు ధర్నాలు, రాస్తారోకో చేశాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి పట్టణంలో ప్రిన్స్ కార్నర్ వద్ద మెయిన్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వలిగొండలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. భూదాన్‌పోచంపల్లిలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. సూర్యాపేట జిల్లాలో పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. గరిడేపల్లి, పెన్‌పహాడ్, అనంతగిరి, మఠంపల్లి మండల కేంద్రాల్లోనూ బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో చేసి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశాయి. తుంగతుర్తి మండలం దేవునిగుట్ట తండాలో, సూర్యాపేట మండలంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు జరిగాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండు పంటలకు రైతు భరోసా ఇవ్వకపోగా, ఇప్పుడు కోతల పేరుతో డ్రామాలు ఆడుతున్నదని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో ఎకరాకు రూ.15వేలు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

హమాలీ కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు

- ఏఐటీయూసీ

భువనగిరి కలెక్టరేట్, జనవరి 6 : సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్ అన్నారు. పెంచిన కూలి రేట్ల జీఓను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా 6వ రోజు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన రేట్ల జీఓను అమలు చేయకపోవడం వెనుక ఉన్న మతలబు అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలు, విద్యార్థులు, అంగన్‌వాడీ సెంటర్లకు జరుగుతున్న ఇబ్బందును దృష్టిలో ఉంచుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలతో సహా ఒప్పంద జీఓను అమలు చేసి, కార్మికులకు రూ.10లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సమ్మె కొనసాగుతుందన్నారు. సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎరియర్స్ సహా మొత్తం డబ్బులు విడుదల చేయాలని కోరారు. అగ్రిమెంట్ కాలపరిమితి ముగిసి సంవత్సరం దాటినా కొత్త రేట్లు అమలు చేయకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే జీఓ విడుదల చేసి సమ్మె విరమింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ వీరారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గొరిగె నర్సింహ, నాయకులు శ్రీనివాస్, రవి, యాదయ్య, బస్వయ్య, సత్తయ్య, శంకరయ్య, జగన్, స్వామి, సత్యనారాయణ, గణేశ్, చంద్రయ్య, కిష్టయ్య, పరశురాములు, రాజు, స్వామి, నర్సింహ, నరేశ్, స్వీపర్లు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో నిండిన చెక్‌డ్యాం

ఆత్మకూరు(ఎం), జనవరి 6 : మండలంలోని కొరటికల్ – ఆత్మకూరు(ఎం) గ్రామాల మధ్య బిక్కేరు వాగుపై రూ.4కోట్లతో చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టారు. ఇప్పుడది గోదావరి జలాలతో నిండి జలకళను సంతరించుకుంది. చెక్‌డ్యాం నిండడంతో చుట్టుపక్కల బోరు, బావుల్లో ఊట పెరుగుతుంది. దాంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డబుల్ బెడ్రూమ్ ఇండ్లను అప్పగించండి

- నల్లగొండలో లబ్ధిదారుల ఆందోళన
- పది రోజుల దీక్షను ప్రారంభించిన సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి

నల్లగొండలో దీక్ష చేస్తున్న డబుల్ బెడ్రూమ్ ఇండ్ల లబ్ధిదారులు, సీపీఎం నాయలు

రామగిరి, జనవరి 6 : నల్లగొండ పట్టణంలోని నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను లాటరీ ద్వారా ఎంపిక చేసిన వారికి వెంటనే అప్పగించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పోరాట సాధన కమిటీ ఆధ్వర్యంలో గడియారం సెంటర్‌లో చేపడుతున్న పది రోజు రిలే నిరాహార దీక్షను సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది దాటినా, నిర్మాణం పూర్తయి సిద్ధంగా ఉన్న ఇండ్లను అర్హులైన పేదలకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. 48వ వార్డులో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను గుర్తించినా ఇప్పటికీ డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించలేదని, ఇకనైనా స్పందించి వెంటనే అప్పగించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఆ పార్టీ నాయకులు సయ్యద్ హశం, దండెంపల్లి సత్తయ్య, ఎండీ సలీం, పద్మ, అశోక్‌రెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.